వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న ఆలయ చైర్మన్ రవీందర్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ అడ్వకేట్ కాలనీలో ఉన్న బాలత్రిపుర సుందరీ దేవి ఆలయ 9వ వార్షికోత్సవాలు బుధవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. దోమలగూడలోని తాళ్ల బస్తీ, అడ్వకేట్ కాలనీతోపాటు పలు ప్రాంతాల ప్రజలు ఉదయం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం రమేష్‌రాం, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సి.మహేందర్ బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు పాల్గొన్నారు.

ఉద్యోగాల పెంపుపై ఉద్యమం చేయాలి

చిక్కడపల్లి: ప్రభుత్వ ఉద్యోగాల పెంపుపై ఉద్యమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ వనరుల హక్కుల రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బక్క జడ్సన్ అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఆయన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థును ఉద్దేశించి మాట్లాడారు. పార్టీలు అధికారంలోకి రాగానే లక్ష పోసుట్ల భర్తీ చేస్తామని హామీలు ఇవ్వడం ఫ్యాషన్‌గా మారిందని తీరా అధికారం రాగనే ఆ హామీని మార్చిపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు ఏ శాఖలో ఎన్ని ఖాళీలపై రివ్యూ మీటింగ్ పెట్టాలేదని మండిపడ్డారు. డిపార్ట్‌మెంట్‌ల రీగా రివ్యూ నిర్వహించి ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పోటీ పరీక్షల తేదీలను పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం లేదన్నారు.

14 నుంచి హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రేపటి (14న) నుంచి మూడు వారాల పాటు హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్న కార్యదర్శి, బీసీసీఐ లెవల్–1 కోచ్ ప్రొ.సత్యనారాయణ తెలిపారు. నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో రేపు (14న) ఉదయం 7 గంటలకు రెండు రోజుల లీగ్ మ్యాచ్ జరుగుతాయని ఓయూ కాలేజీలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8520011662, 9000627456 నం సంప్రదించాలన్నారు.

సర్కారు స్కూళ్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి
- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో బోధన
- నిష్ణాతులైన.. అర్హత కల్గిన వారే ఉపాధ్యాయులు
- ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు



గోల్నాక పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్‌లు

అంబర్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన ఆత్మవిశ్వాసం ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన వారు దేశంలో ఎన్నో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బడి బాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ అమృత, పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, కన్నె ఉమా రమేశ్ యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉందన్నారు. ఉపాధ్యాయులు కూడా అన్ని విధాలా అర్హులే ఉంటారని స్పష్టం చేశారు. బడి ఈడుకు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు ఈసంగర్భంగా సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపి నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఏ చిన్న అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి, డిప్యూటీ ఐవోఎస్ నిజామొద్దీన్, యూసీడీ విభాగం అధికారిణి రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో...

అంబర్‌పేట డివిజన్‌లోని పోలీస్ బాయ్స్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమానికి కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందించారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి...

కాచిగూడ: విద్యార్థులు మనస్సు, శరీరం పవిత్రంగా ఉంచుకోవడం వలన లక్ష్యాలను చేరుకోవచ్చని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. విద్యార్థులకు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సూచించారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఉపేంద్ర, హెడ్‌మాస్టర్ విజయలక్ష్మీ, మంగారెడ్డి, సుల్తాన, స్నేహలత, వీరేష్, సునితారావు, ఈశ్వర్ ఎడ్డి, సుభాష్ పటేల్, సంతోష్, ఎస్.రవియాదవ్ పాల్గొన్నారు.

నల్లకుంటలో బడిబాట...

నల్లకుంట: చిన్నారుల జీవన ప్రగతికి చదువు కీలకం అని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. చదువుతో పాటు ప్రాపంచిక జ్ఞానం, మానవ ప్రేమ, మంచిచెడుల విచక్షణ, బంధాలు, అనుబంధాలు.. ఇలా ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్నదే జీవితమని పేర్కొన్నారు. బుధవారం 'బడిపాట' కార్యక్రమాన్ని నిర్వహించా. ఈ సందర్భంగా సత్యానగర్, నర్సింహ బస్తీ, టీఆర్టీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కార్పొరేటర్ అక్కడి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం అందజేసి మాట్లాడారు. బడీడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, వారి స్వీయ శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటారని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య: కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచనశ్రీ, ముషీరాబాద్ మండలం డిప్యూటీ డీఈవో చిరంజీవి అన్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని చిత్రాల నర్సింహులు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్‌లు బ్యాగ్‌లు అందజేశారు. ముషీరాబాద్ మండల డిప్యూటీ ఏఓఎస్ జయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. మీనాకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మేడే దేవదాస్, బీజేపీ రాష్ట్ర జి. వెంకటేష్, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సి.మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో...

ముషీరాబాద్: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునప్రారంభమయ్యాయి. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ముషీరాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోటీస్‌లు స్వరూపారాణి, విజయలక్ష్మిల సారథ్యంలో తరగతి గదులను రంగురంగుల పూలతో ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలికారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హాజరై విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్లు, పాఠ్య పుస్తకాలను ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 22 ప్రాథమిక, 27 ఎయిడెడ్, ఏడు ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలకు హాజరైయ్యారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకోని 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధి విద్యార్థులను అభినందిస్తూ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి నగదు బహుమతితో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ స్వాగతం పలికి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, రత్నం, జానకి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్...



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నల్లకుంట కార్పొరేటర్ అమృత



అంబర్‌పేట పోలీస్ బాయ్స్ స్కూల్‌లోపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్



కాచిగూడలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్



కవాడిగూడలో కార్పొరేటర్ రచనశ్రీ, డిప్యూటీ డీఈవో చిరంజీవి తదితరులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలి



దీక్షలో పాల్గొన్న యూనియన్ నేతలు

కవాడిగూడ: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆధార్ కార్డును ప్రయాణికులు చూపిస్తుండటంతో కండక్టర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆధార్ కార్డులాగా ఆర్టీసీ ప్రత్యేక ఐడీ కార్డును ముద్రించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌వద్ద బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుద్దాల సురేష్ మాట్లాడుతూ... ఎంవీ యాక్ట్ 1961ని ఆర్టీసీలో అమలు చేయాలని, సస్పెండ్, రిమూవ్ అయిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. రిటైర్‌మెంట్ అయిన కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలని, 2017కు సంబంధించిన పే స్కేల్ ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్షలో యూనియన్ నాయకులు బి.నాగేందర్, బి.యాదయ్య, పి.రవీందర్, శ్రీనివాస్, లాలయ్య, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆఫ్ సెంట్రల్‌కు 'బెస్ట్' అవార్డు



బెస్ట్ క్లబ్ అవార్డును అందుకుంటున్న రమేష్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులోని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ 2023 సంవత్సరంలో అత్యధికంగా మెడికల్ క్యాంపులు నిర్వహించినందుకు గాను వాకర్స్ ఇంటర్నేషనల్ బెస్ట్ అవార్డును ప్రకటించింది. బుధవారం సుందరయ్య పార్కులో క్లబ్ మాజీ అధ్యక్షుడు సలిపేల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సునీల్‌లు వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యాలను కాపాడడానికి వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. మరింతగా ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, కె.వి.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, రమేష్, మనోహర్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వీఎస్‌టీ రోడ్డులోని పార్కు వద్ద సుమారు 200 మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ... నిరంతరం పేదలకు సేవ చేయడమే పరమావధిగా తమ క్లబ్ పని చేస్తుందన్నారు. క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ నీలా శ్రీధర్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, డాక్టర్ బి.శ్రావణ్ కుమార్, మారం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలి: ఏబీవీపీ

పంజగుట్ట: నీట్ పరీక్ష పేపర్ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యదర్శి శ్రావణ్ బిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీతో కలిసి ఆయన మాట్లాడుతూ... నీట్ యూజీ ఫలితాల్లో 67 మంది విద్యార్థులు 1వ ర్యాంకు సాధించడం అందులో ఎక్కువమంది ఒకే పరీక్షా కేంద్రం నుంచి వచ్చినవారే ఉండటం దారుణమన్నారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సమావేశం ఈ నెల 7, 8వ తేదీల్లో గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిందని, విద్యారంగంలోని వివిధ సమకాలిన పరీక్షల్లో జరుగుతున్న అవకతవకలపై చర్చ జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర సెక్రటరీ శ్రీకాంత్, కళ్యాణి పాల్గొన్నారు.

వీసీల నియామకాల ఆలస్యంపై ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు కొత్త వీసీల నియామకాలలో జాప్యం పట్ల సీనియర్ అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 15 వరకు వీసీలను నియమిస్తారనే ఆశతో ఎదురు చూసిన ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వం నియామకపు ప్రక్రియను ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా వీసీల నియామకానికి ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ సభ్యులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ తరపున ఒక్కొక్కరిని నియమించగా యూనివర్సిటీల పాలక మండలి (ఈసీ) నుంచి మూడో వ్యక్తిని సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తారు. అయితే వర్సిటీలు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులపై వీసీ పదవికి దరఖాస్తు చేసుకున్న ప్రొఫెసర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. ఎందుకంటే వర్సిటీ పాలక మండలి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తారు.. సెర్చ్ కమిటీ సభ్యుని నియామకంలో వీసీదే కీలక పాత్ర. వారికి అనుకూలమైన వ్యక్తులను సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించుకోవచ్చు. అయితే పదవీ కాలం ముగిసిన కొందరు మరో మారు వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తాము పదవిలో ఉన్నప్పుడు నియమించిన సెర్చ్ కమిటీ సభ్యులు ఇప్పుడు వారికి అనుకూలంగా వ్యవహరిస్తారనే అనుమానం ప్రొఫెసర్లు వ్యక్తం చేస్తున్నారు. రెండో సారీ వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్న వర్సిటీలకు పాత వారిని తొలగించి కొత్త వ్యక్తిని సెర్చ్ కమిటీ సభ్యుడిగా నియమించాలని సీనియర్ ప్రొఫెసర్లు కోరుతున్నారు.

గో సంరక్షణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి

కాచిగూడ: గో సంరక్షణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి గోసంరక్షణ చట్టాన్ని దేశ వ్యాప్తంగా పటిష్టంగా అమలు చేయాలని గోశాల ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రేమ్‌చంద్ మునోద్, రిధేష్ జాగీర్‌దార్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ... గోవులను సంరక్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ తలచుకుంటే కేవలం 5 నిమిషాల్లోనే దేశంలోని గోవులను రక్షించే అవకాశమున్నా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో గోవుల రక్తం నేలపై పడకుండా గోవులను కాపాడుతామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలో ప్రసార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నా గోవుల సంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. జీహెచ్‌ఎంసీ 519 యాక్టు ప్రకారం రాతపూర్వకంగా కమిషనర్ అనుమతి లేకుండా మూగజీవాలను నగరంలోకి తీసుకురావడానికి వీలులేదని, కానీ నిత్యం లక్షల సంఖ్యలో మూగజీవాలు నగరంలోకి ప్రవేశిస్తున్నా అధికారులు, పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. గోవుల సంరక్షణను విస్మరించిన ప్రభుత్వాలకు భవిష్యత్తులో మనుగడ ఉండదని ఆయన హెచ్చరించారు. గోవుల సంరక్షణ విషయంలో ప్రజలే ఆయా ప్రభుత్వాలపై తిరగబడే రోజులు వస్తాయని అన్నారు.



మాట్లాడుతున్న గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్


టీజేఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఆకుల శ్రీనివాస్



ప్రొఫెసర్ కోదండరామ్‌తో శ్రీనివాస్

కాచిగూడ: తెలంగాణ జనసమితి కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఆకుల శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ... టీజేఎస్ కార్మిక విభాగాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. పార్టీ కార్మిక విభాగం నేతలు మహ్మద్ రఫీ, బాల నర్సయ్య, జగదీష్, రాజు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎత్తు, బరువుపై ఫోకస్



బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు కొలతలు, బరువు నమోదు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తూ వారిలో పోషకాహార లోపాలు ఉంటే సరిదిద్దుతున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ ఐదేళ్ల లోపు వయస్సు పిల్లల ఎత్తు, బరువును చూస్తూ వాటిని రికార్డుల్లో నమోదు చేయడమే కాకుండా వారిలో రక్తహీనత, పోషక లోపాలపై దృష్టిసారిస్తున్నారు. ఎత్తు, బరువు పెరగకపోతే వారికి పోషక పదార్థాలు అదనంగా అందిస్తూ తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చి పోషకాలు ఏ ఆహార పదార్థాల్లో లభిస్తాయో వాటిని తినిపించాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధిలో 22,348 మంది చిన్నారుల ఎత్తు, బరువు ఇప్పటికే నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలు ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కాగా, టీచర్లు రోజూ చిన్నారుల వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

వరద సమస్యలపై పటిష్ట చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వరదనీరు నిలిచి పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేటర్ పావని, స్టీల్ బ్రిడ్జి ప్రాంజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేశ్‌కుమార్, ప్రాజెక్ట్ ఏఈ సాయికృష్ణ, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, అధికారులతో కలసి బుధవారం జవహర్‌నగర్ ప్రధాన రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వెళ్లే ప్రధాన రోడ్డులో జవహర్‌నగర్ వద్ద వరదనీరు నిలిచి పోవడంతో ప్రజలు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కచ్చానాలాలో వ్యర్థాలు తొలగించినా వరదనీరు నిలువడానికి కారణాలు తెలుసుకున్నారు. వెంటనే సమస్యలు పరిశీలించి వెంటనే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ ఏరియా ఇన్‌చార్జి శంకర్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, బీజేపీ నాయకులు పి.నర్సింగ్‌రావు, అరుణ్‌కుమార్, ప్రశాంత్, ప్రవీణ్, స్థానిక నేత పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం

ముషీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురాం డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ... విద్యా సంస్థలు ప్రారంభం అవుతున్న వేళ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడటం లేదన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, సౌకర్యం కల్పన స్వీపర్, స్కావెంజర్ పోస్టుల భర్తీపై, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాల పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వాటి బాగు కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేష్, ఎస్.రాకేష్, నాయకులు నాగరా, మధు, ప్రణయ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ మోసాలపై ఉద్యోగులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హిమాయత్‌నగర్: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అప్రమత్తమైన నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఉద్యోగులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా ఆయా కార్యాలయాలకు వెళ్లి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్‌లో ఉద్యోగులకు ట్రేడింగ్, ఫేక్ లోన్ యాప్‌లు, ఫెడెక్స్, ట్రాయ్ మోసాలు, పార్ట్ టైమ్ జాబ్, సోషల్ మీడియాలో వేధింపులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డెబిట్, క్రెడిట్ కార్డ్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తులకు వెల్లడించవద్దని, ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి డయల్ చేయడం ద్వారా, లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

గురుకుల కొత్త టీచర్ల ఎదురు చూపులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలు వచ్చాయని చేసే పనులు మానుకొని పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నామని ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు ఎంపికైన కొత్త టీచర్లు వాపోతున్నారు. బుధవారం ఓయూలో వారు మాట్లాడుతూ..గురుకుల టీచర్ ఉద్యోగాలకు ఎంపికై న టీచర్లకు పోస్టింగుల పక్రియను వేగవంతం చేయాలన్నారు. గతేడాది ఆగస్టు నెలలో పరీక్ష రాసి ఎంపికై న అభ్యర్థులకు 2024 మార్చి 4న ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్న నియామకపు పత్రాలను 60 రోజుల్లో ఉద్యోగంలో చేరాలని పేర్కొన్నారని కానీ..100 రోజులు గడుస్తున్న ఇంత వరకు ఎలాంటి కదలిక లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ ఉద్యోగ నియామకపు పత్రాలు అందుకున్న సుమారు 5000 మంది అభ్యర్థులు మూడు నెలలుగా నిరీక్షిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న తర్వాత చేసే పనులను మానుకొని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన. ఎన్నికల కోడ్ ముగిసినా టీచర్ల పోస్టింగ్‌ల పక్రియ పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గురుకుల్లో ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకు త్వరితగతిన పదోన్నతులు, బదిలీల పక్రియను పూర్తి చేసి కొత్త వారికి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. లేదా ఇంకా సమయం తీసుకుంటే తేదీలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

బీసీ కులగణన ప్రక్రియను ప్రారంభించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ కులగణన పక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబరు.26 తీసుకొచ్చి బీసీ కులగణనకు బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించిన అంశాన్ని గుర్తు చేశారు. కులగణన చేపట్టి కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు రవి, కిరణ్ పాల్గొన్నారు.